


# కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**-మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి రాజమౌళి**

**గజ్వేల్ టౌన్, జూలై 25 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు వీధికుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ నర్సయ్య, వెటర్నరీ ఏడి రమేష్, మున్సిపల్ పాలకవర్గంతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌లో వీధికుక్కల బెడద ఎక్కువగా ఉందని ప్రభుత్వ పరంగా, మున్సిపల్ అధికారులు కుక్కలపట్ల తగు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జకియొద్దీన్, కౌన్సిలర్లు వంటేరు గోపాల్‌రెడ్డి, రహీం, పంబాల అర్చన శివకుమార్, గంగిశెట్టి చందన రవీందర్, మర్కంటి వరలక్ష్మి కనకయ్య, మామిడి విద్యారాణి శ్రీధర్, బొగ్గుల చందు తదితరులు పాల్గొన్నారు.

# నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలి

**మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి**

**చిన్నశంకరంపేట, జూలై 25,ప్రభాతవార్త:** ఎన్నికల్లో గెలిచిన వెంటనే నిజాం షుగర్ ఫ్యాక్టరిని తెరపిస్తానని హమి ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామిని నిలబెట్టుకోవాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు.గురువారం చిన్నశంకరంపేటలో మాట్లాడుతూ బిజెపి ఎంపీలకు, నాయకులకు చిత్తశుద్ది ఉంటే మెదక్ నుండి మనోహరబాద్ వరకు కొత్త రైల్వే మార్గాన్ని మంజూరు చేయించుకురావాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హమిల మేరకు మెదక్ నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరపించాలని, మెదక్ నుండి మనోహరబాద్‌కు రైల్వే లైన్‌ను తిసుకరావాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బడ్జెట్‌లో గ్యారంటీలను విస్మరించారని, ఆరు గ్యారంటీల హామిల ఊసే లేదన్నారు. ప్రభుత్వానికి పూర్తి స్థాయిలో రుణమాఫీ చేసే దమ్ము లేదన్నారు. ఎన్నికల్లో గ్యారంటీల గారడీ చేసినట్లే కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు బడ్జెట్‌లో అంకెల గారడీ చేసిందన్నారు.




మీ-సేవా కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

## మీ-సేవా కేంద్రాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

**పాపన్నపేట, జూలై 25, ప్రభాతవార్త:** మండలపరిధిలోని మీ-సేవా కేంద్రాలతోపాటు టేక్మాల్ మండలంలోని మీసేవకేంద్రాలను గురువారం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. మీ-సేవా కేంద్రం తీరు గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈఎస్‌డి నూతనంగా ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ పేమెంట్ విధానాన్ని పరిశీలించి ప్రజలకు క్యాస్ లెస్ డిజిటల్ పేమెంట్ చేయాలని, ఫలితంగా అదనపు రుసుములు చెల్లించకుండా ఉంటారని ప్రజలకు సూచించారు. రెవిన్యూ సర్వీసులకు సంబంధించి రైన పత్రాలు మాత్రమే జతపర్చాలని, లేకుంటే నూతనంగా ప్రవేశపెట్టిన ఓసిఆర్ విధానం ద్వార తిరిగి మీ లాగిన్ లోకి వస్తాయన్నారు. జిల్లాలోని మీ-సేవా కేంద్రాల పనితీరుపై తనతో పాటు జిల్లా అధికారులు ఆకస్మిక తనికీ చేపడతారని పేర్కొన్నారు. ధరణి సర్వీసులకు ఎలాంటి అదనపు రుసుము తీసుకోకుండా నడపాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ సందీప్, టెక్మాల్ మండల తహసీల్దార్, టీజీటీఎస్ఎస్ మీ-సేవా మేనేజర్ శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

### కేతకి సంగమేశ్వరస్వామికి అదనపు కలెక్టర్ ప్రత్యేక పూజలు



కేతకి ఆలయాన్ని దర్శించుకుంటున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

**ఝరాసంగం, జూలై 25, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో పార్వతీ దేవి సమేతంగా కొలువున్న శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి ఆలయాన్ని గురువారం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న అదనపు కలెక్టర్‌ను అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా అదనపు కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆలయ అర్చకలు అదనపు కలెక్టర్‌కు ఆశీర్వచనాలు చేసి తీర్థ ప్రసాదాలు అందించి శాలువాతో సత్కరించారు.

## రైతులకు ఇబ్బందులు కలగకుండా చూసుకోండి

**జిల్లా వ్యవసాయాధికారి మహేష్**



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి

**కొమురవెల్లి, జూలై 25, ప్రభాతవార్త :** రుణమాఫీ పూర్తయిన రైతులు బ్యాంకులకు వస్తున్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాల్సిన బాద్యత బ్యాంక్ అధికారులపై ఉందని జిల్లా వ్యవసాయ అధికారి మహేష్ అధికారులకు సూచించారు. గురువారం కొమురవెల్లిలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్(ఎపిజివిబి) బ్యాంకును జిల్లా బ్యాంక్ లీడ్ మేనేజరుతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడి బ్యాంకులో ఎదుర్కొనే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి సమస్యరాకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు.అనంతరం మాట్లాడుతూ మండల వ్యాప్తంగా మొదటి విడుత రుణమాఫీలో 1048 మంది రైతులకు రుణమాఫీ జరిగిందన్నారు. లక్ష లోపు రుణాలు ఉండి అవి మాఫీ కాని రైతులు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి మండల వ్యవసాయ అధికారి ఉన్నారు.

## అన్ని వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్

**అంకెల గారడీగా బడ్జెట్**

**-బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**

**గజ్వేల్, జూలై 25 (ప్రభాతవార్త):**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని చెప్పి ఇంత వరకు ఏ ఒక్క హామీ నెరవేర్చకపోవడం సిగ్గుచేటని గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీగా ఉందని ఎద్దేవ చేశారు. బడ్జెట్ ప్రవేశపెట్టి ప్రజలను మరోసారి మోసం చేసేవిధంగా కుట్ర పన్నారన్నారు. 72వేల కోట్ల రైతు బడ్జెట్‌లో రైతు బీమా కోసం డబ్బులు లేవా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదల పాలిట శాపంగా ఉందన్నారు. అన్ని వర్గాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వకుండా బడ్జెట్ ప్రవేశపెట్టడం సరైందికాదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు 1వ తేదీన జీతాలు ఇస్తున్నామనడం ఎంతవరకు నిజమని, 1వ తేదీన జీతాలు రాక ప్రభుత్వ ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

కెసిఆర్ ప్రభుత్వంలో ప్రతి వర్గానికి పెద్దపీట వేశారని, అన్ని కులాలకు బడ్జెట్‌లో సమాన ప్రాధాన్యత కల్పించారన్నారు. దళితబంధు పథకాన్ని, గొల్లకుర్మ యాదవ సోదరులకు గొర్రెల పథకాన్ని నిలిపివేసే విధంగా బడ్జెట్ ఉందన్నారు. ప్రాజెక్టుల కోసం భూములు అప్పగించిన భూనిర్వాసితుల ఊసే లేదన్నారు. గతంలో కెసిఆర్ ప్రభుత్వంలో మల్లన్నసాగర్ చుట్టూ దాదాపు 2వేల కోట్ల రూపాయలతో ఈకో టూరిజం ఏర్పాటు చేయడం కోసం ప్రయత్నాలు చేపడితే కనీసం కాంగ్రెస్ ప్రభుత్వం మల్లన్నసాగర్ పేరును కూడా తీయక పోవడం బాధాకరమన్నారు. మొత్తంమీద రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీ తప్ప అందులో ఏమీలేదని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. తెలంగాణ ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు పోరాడుతామన్నారు.

# రుణమాఫీ సజావుగా సాగేందుకు చర్యలు

**మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్**



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

**రామాయంపేట మున్సిపాలిటీ, జూలై 25, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రుణమాఫీ ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. గురువారం రామాయంపేటలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంక్‌ను జిల్లా కలెక్టర్ సందర్శించి రుణమాఫీ ప్రక్రియ, అమలు విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రుణమాఫీ ప్రక్రియలో భాగంగా ఎంత మందికి రుణాలు మంజూరయ్యాయి, మంజూరైన రుణాలలో మళ్లీ ఎంతమంది రెన్యూవల్ చేసుకున్నారు, ఎంత మందికి రుణాలు తిరిగి మంజూరు చేశారు వంటి విషయాలను బ్యాంకు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా రుణమాఫీకి సంబంధించి రైతులకు కలిగే సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని, ఫిర్యాదులను ఎప్పటికప్పుడు స్వీకరించి పరిష్కరించేవిధంగా చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా రుణమాఫీ ప్రక్రియలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా, సకాలంలో రుణాలు అందుతున్నాయ, బ్యాంకు అధికారుల నుండి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా, వరి నాట్లుపడుతున్నాయా, రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయా వంటి విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టినటువంటి రుణమాఫీ ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని, వ్యవసాయ శాఖ, సహకార శాఖ, బ్యాంకు అధికారులతో కలిసి రైతులకు ఎలాంటి ఇబ్బదులు లేకుండా వేగవంతంగా రుణమాఫీ ప్రక్రియ జరిగేందుకు పంట రుణాలను త్వరితగతిన రెన్యువల్ చేసేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని అన్నారు. రైతులకు రుణమాఫీ విషయంలో ఎలాంటి సందేహాలు ఉన్నా నేరుగా వ్యవసాయ శాఖ మరియు బ్యాంకు అధికారులను సంప్రదించాలని చెప్పారు. అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీకి సంబంధించిన డబ్బులు వారి అకౌంట్‌లో జమచేయబడుతాయని రైతులకు ఎలాంటి సందేహాలు ఉన్న వారి ఆధార్ వివరాలు తెలియజేసి వ్యవసాయ శాఖ ద్వారా రూపొందించినటువంటి రుణమాఫీ వెబ్‌సైట్‌లో వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా తెలుసుకోవచ్చని రైతులకు సూచించారు. రామాయంపేట మండల వ్యాప్తంగా మొదటి విడతగా లక్ష రూపాయలులోపు పంట రుణం కలిగిన రైతులు 2613 మంది రైతులకుగాను వివిధ బ్యాంకుల ద్వారా రూ.13.61 కోట్ల రూపాయలు విడూదల చేయగా అందులో 2599 మంది రైతుల ఖాతాల్లో రూ.13.57 కోట్ల రూపాయలు జమ చేయబడినవి అన్నారు. వివిధ సాంకేతిక కారణాల వల్ల 14 మంది రైతులకు సంబంధించి రూ.0.04కోట్ల రూపాయలు జమ కావాల్సి ఉందని వివరించారు. జిల్లా వ్యాప్తంగా మొదటి విడతగా లక్ష రూపాయలు లోపు పంట రుణం కలిగిన రైతులు 47978 మంది రైతులకుగాను వివిధ బ్యాంకుల ద్వారా రూ.238.81 కోట్ల రూపాయలు విడుదల చేయగా అందులో 47611 మంది రైతుల ఖాతాల్లో రూ.237.5 కోట్ల రూపాయలు జమ చేయబడినవి అని పేర్కొన్నారు. వివిధ సాంకేతిక కారణాల వల్ల 362 మంది రైతులకు సంబంధించి రూ.1.3కోట్ల రూపాయలు జమ కావాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ, బ్యాంకు మేనేజర్ నందకిషోర్, వ్యవసాయ విస్తీర్ణ అదికారి రాజు, బ్యాంకు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



జంగరాయిలో కూలిన ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు

## వర్షాలకు కూలిన ఇళ్లు

**నిరాశ్రయురాలైన వృద్ధురాలు..పునరావాసం కల్పించిన అధికారులు**

**చిన్నశంకరంపేట, జూలై 25, ప్రభాతవార్త:** మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాలలో శిథిలావస్థకు చేరిన ఇండ్లు కూలిపోతున్నాయి. మండల పరిధి జంగారాయి గ్రామానికి చెందిన వృద్ధురాలు భారతమ్మ నివాస గృహం పాక్షికంగా కూలిపోయింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ మన్నన్, ఎంపీవో కరిముల్లా కూలిన గృహన్ని పరిశీలించారు. గ్రామంలో ఎస్సీ కమ్యూనిటి హల్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక పునరావాస కేంద్రంకు వృద్ధురాలిని తరలించారు. బియ్యం అందించాలని డీలర్ మోహన్‌కు నిత్యావసర సరుకులు అందించాలని పంచాయతీ కార్యదర్శి భానుకుమార్‌కు సూచించారు. వృద్ధురాలి భర్త పోచయ్య అనారోగ్య సమస్యలతో గతంలోనే మృతి చెందగా, కుమారుడు గిరిబాబుతో కలిసి ఉంటుంది. నెల రోజుల క్రితం కుమారుడు తల్లి వృద్ధురాలైన భారతమ్మను వదిలేసి ఇంటి నుండి ఎటో వెళ్లిపోయాడు. వృద్యాప్యంలో తీవ్ర ఇబ్బందులు పడుతు జీవనం సాగిస్తున్నానని, ఒకరి తోడు లేనిదే నవడలేనని రోదిస్తూ అధికారులకు తెలిపింది. భారతమ్మ ఇద్దరు కుమార్తెలకు సమాచారం అందించినప్పటికి వారు స్పందించడం లేదని గ్రామస్తులు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని అధికారులు ఆదేశించారు. ఆయన వెంట పోలీసులు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

### మురుగు కాల్వలను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

**గజ్వేల్ టౌన్, జులై 25 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 2వ వార్డులో గల రాజిరెడ్డిపల్లిలో మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య గురువారం ములుగు కాల్వలను పరిశీలించారు. వర్షాకాలం దృష్ట్యా గ్రామాన్ని సందర్శించి పారిశుధ్యం తీరును పరిశీలించినట్లు తెలిపారు. ఆయన వెంట టిపిఓ ఎల్.శ్రీధర్‌రెడ్డి, ఏఈ శ్రీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



మురుగు కాల్వను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నర్సయ్య

## కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు గుండుసున్నా

**సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేష్**

**హుస్నాబాద్ రూరల్, జూలై 25, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణా రాష్ట్రానికి గుండు సున్నా పెట్టిందని సిపిఐ పార్టీ రాష్ట్ర రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేష్ మండిపడ్డారు. గురువారం బడ్జెట్ కేటాయింపుపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు కోడలు నిర్మలా సీతారామన్ తెలంగాణకు భారీ బడ్జెట్ విడుదల చేస్తారని ఆశించామని,కానీ దక్కింది శూన్యమన్నారు.రూ 48లక్షల ఇరవై ఒక్క వేయి కోట్లతో బడ్జెట్ ప్రవేశ పెట్టినప్పటికి కేవలం కొన్ని రాష్ట్రాలకు మాత్రమే పెద్ద పీఠ వేశారని ఆరోపించారు.బడ్జెట్‌లో తెలంగాణ ప్రస్థావనే లేకపోవడం బాదాకరమైన విషయమన్నారు.ఈ విషయంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. బడ్జెట్ విషయం పక్కన పెడితే ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో హామీలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు.ములుగు యూనివర్సిటీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ కాజీపేట రైల్వేకోచ్‌లు గుర్తుకు ఊసే లేదన్నారు. ఏపి,బీహార్ లాంటి రాష్ట్రాలకు భారీగా నిధులు కేటాయించి తెలంగాణ ముఖాన బురద కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.రెండు రాష్ట్రాలకు నిధులు ఇచ్చినందుకు తమకు బాద లేనది,కానీ మిగతా రాష్ట్రాలను చిన్నచూపు చూడడం బాదాకరమైన విషయమన్నారు.తెలంగాణ రాష్ట్రం నుండి 8మంది ఎంపిలు ఉండి నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారన్నారు.రాష్ట్రానికి నిధులు తీసుకురాని ఎంపిలు తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

### ఉద్యోగులకు డిఎ ప్రకటించాలి.. పిఆర్‌సి అమలు చేయాలి

**సంగారెడ్డి టౌన్, జూలై 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు డిఎ ప్రకటించడంతో పాటు పిఆర్‌సి అమలు చేయాలని టిఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. గురువారం మండల యుటిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పట్టణంలోని ఉన్నత పాఠశాల, ఇస్మాయల్ ఖాన్‌పేట్, ఫసల్వాదిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సభ్యత్వాలను చేశారు. ఈ సందర్భంగా టిఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి సాయిలు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన డియర్‌నెస్ అలవెన్స్ 4 పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వం చేసిన హామి మేరకు వెంటనే డిఎ ప్రకటించాలని, రెండవ పిఆర్‌సి కమిటి నివేదికపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపి 30 శాతం ఫిట్మెంట్‌తో అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న జిపిఎఫ్, టిఎస్జిఎల్ఐ, ఇతర బిల్లులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లెఫ్ట్ ఓవర్ వెకెన్సుల పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమలో టిఎస్ యుటిఎఫ్ సంగారెడ్డి మండల నాయకులు బి కమలాకర్‌రావు, సూర్యనారాయణశర్మ, కిషన్ పవర్, వినయ్‌కుమార్, పి రాజు, వై సైమన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

# విద్యారంగానికి కేంద్రం 10 శాతం నిధులు కేటాయించాలి

**యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి**

**గజ్వేల్, జూలై 25 (ప్రభాతవార్త):**

కేంద్ర ప్రభుత్వం విద్యారంగానికి 2.6 శాతం నిధులు కేటాయించడం దారుణమని యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి పేర్కొన్నారు. ఈ నెల 14వ తేదీన హైద్రాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన యుఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశంలో గజ్వేల్ మండలానికి చెందిన తాటికొండ రవిని యుఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. అధ్యక్షుని హోదాలో గురువారం గజ్వేల్ పట్టణానికి విచ్చేసిన సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం రవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యారంగానికి కేటాయించిన నిధుల పట్ల తీవ్ర అసంతృప్తి తెలిపారు. కొఠారి కమిషన్ ప్రకారం కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి 10 శాతం నిధులు కేటాయించాలని, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ 2.6 శాతం నిధులు కేటాయించడం అన్యాయమన్నారు. రాష్ట్రంలో వందలాది ప్రైవేట్, కార్పోరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా లక్షల రూపాయలు ఫీజుల పేరిట వసూలు చేస్తున్నా ప్రభుత్వం చూసిచూడనట్లు వ్యవహరించడం సరైందికాదన్నారు. రాష్ట్రంలో అనుమతి లేకుండా ఎన్నో విద్యా సంస్థలు నడుపుతున్నారని వాటిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ హాస్టళ్లలో ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించి విద్యార్థుల ఆరోగ్యాలు కాపాడాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా హాస్టళ్లలో, ప్రభుత్వ విద్యా సంస్థలలో సర్వే చేసి సచివాలయం ముట్టడికి పిలుపునిస్తామని హెచ్చరించారు. ఆయనతో పాటు సిద్దిపేట జిల్లా నుండి చంద్లాపురం మధు రాష్ట్ర ఉపాధ్యక్షునిగా, రాష్ట్ర కమిటీ సభ్యునిగా నాచారం శేఖర్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ నాయకులు దిలీప్, సందీప్, ప్రవీణ్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.




తాటికొండ రవిని సన్మానిస్తున్న యుఎస్ఎఫ్ఐ నాయకులు



మైనంపల్లి హన్మంతరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు

## బిఆర్ఎస్ పార్టీకి ఇద్దరు కౌన్సిలర్లు రాజీనామా

**మైనంపల్లి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక..**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

సిద్దిపేట మున్సిపల్‌పరిధిలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ఇలాకలో బిఆర్ఎస్‌కు మరోషాక్ తగిలింది. ఇప్పటికే మున్సిపల్ పరిధిలోని బిఆర్ఎస్‌కు చెందిన ముగ్గురు కౌన్సిలర్లు ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం మరో ఇద్దరు బిఆర్ఎస్ కౌన్సిలర్లు అలకుంట్ల కవిత, పయ్యావుల పూర్ణిమ ఎల్లంలు ఆ పార్టీకి రాజీనామా చేసి హైదరాబాద్‌లో మైనంపల్లి హన్మంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన 14వ వార్డు కౌన్సిలర్ అలకుంట కవిత, 43వ వార్డు కౌన్సిలర్ పయ్యావుల పూర్ణిమ ఎల్లంలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు తూంకుట నర్సారెడ్డి, సాకి అనంద్ తదితరులు ఉన్నారు. అనంతరం సిఎం రేవంత్ రెడ్డిని మార్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిసింది.

## నిరాశ పరిచిన రాష్ట్ర బడ్జెట్

**-తపస్ మెదక్ జిల్లా అధ్యక్షుడు జిడ్డి ఎల్లం**

**కొల్చారం, జూలై 25 ప్రభాతవార్త:** రాష్ట్ర ఆర్థిక మంత్రి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2024-25 వార్షిక బడ్జెట్ తీవ్ర నిరాశపరిచిందని తపస్ మెదక్ జిల్లా అధ్యక్షులు జిడ్డి ఎల్లం అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ అంకెల గారడీ తప్ప మరేమి లేదని, విద్యా వ్యవస్థకు కేవలం 7.31 శాతం నిధులు అనగా 21,292 కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకుందన్నారు. విద్యా వ్యవస్థపై ప్రభుత్వానికి సవతి తల్లి ప్రేమ మాత్రమే ఉందని అర్థమవుతుందన్నారు. అభివృద్ధి చెందిన రాష్ట్రాలు విద్యాశాఖకి 15-25 శాతం వరకు వార్షిక బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నాయని, విద్యాశాఖకు కేటాయింపుల్లో గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి పెద్ద తేడా ఏమీ లేదన్నారు. మౌలిక వసతుల కల్పన కోసం విద్యాశాఖకు మరిన్ని నిధులు కేటాయిస్తే బాగుండేదని అన్నారు.

**ఆర్‌టిఐ చట్టం కింద సిసి పుటేజీ ఇవ్వమని అడిగితే**

## అసాధ్యమన్న ఎసిపి..హైకోర్టులో పిటిషన్ వేస్తా

**కాంగ్రెస్ నాయకులు చక్రధర్‌గౌడ్**



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు చక్రధర్‌గౌడ్

**సిద్దిపేట అర్బన్, జూలై 25, ప్రభాతవార్త :** ఓ కేసు విషయంలో సిద్దిపేట ఏసీపీని ఆర్‌టిఐ చట్టం కింద సీసీ పుటేజీలు అడిగితే ఇవ్వడం అసాధ్యమని చెప్పడం సరికాదని కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఫస్ట్ ఫార్మర్ సొసైటీ చైర్మన్ గాదగోని చక్రధర్‌గౌడ్ మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. సీసీ పుటేజీలు ఇవ్వడం అసాధ్యమని చెప్పిన ఏసీపీపై హైకోర్టులో ఫిటిషన్ వేస్తానని తెలిపారు. ప్రతి పోలీసుస్టేషన్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని న్యాయ స్థానం చెబుతుంటే సిద్దిపేట ఏసీపీ సీసీ కెమెరాలు ఏర్పాటు దశలో ఉన్నాయని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తనపై అక్రమ కేసులు పెట్టడానికి ఏసీపీ కుట్రలు చేస్తున్నారని తనకు ఎలాంటి హానీ జరిగిన అయనే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. తనకు నామినేటెడ్ పోస్టు వస్తుందని తెలిసిన ఏసీపీ ఏదైనా అక్రమ కేసు పెట్టి రాకుండా చూడాలని కుట్రలు చేస్తున్నారని అరోపించారు. పోలీసు స్టేషన్‌లు, సర్కిల్ కార్యాలయాల పరిధిలోని వెయ్యి మీటర్ల లోపు ఎదైనా జరగరానిది జరిగితే సీసీ పుటేజీలు ఇవ్వడం అసాధ్యమని చెబుతారా అని ప్రశ్నించారు. ఏసీపీ హోదాలో ఉండి అసాధ్యమనే వ్యాఖ్యాలు చేయడం సిగ్గుచేటన్నారు. ఏసీపీ వ్యవహారశైలిపై సీఎం రేవంత్‌రెడ్డితో పాటు డీజీపీ జితేందర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.సిఎం రేవంత్‌రెడ్డితోపాటు పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుపై అర్థం, పర్థం లేకుండా ఆరోపణలు, విమర్శలుచేస్తే చూస్తూ ఉరుకోనని హెచ్చరించారు. బిజెపి నాయకులు దేవుని పేరు చెప్పి 8 మంది ఎంపిలు గెలిస్తే రాష్ట్రానికి తేచ్చేదేమిలేదన్నారు. ప్రజలను మోసం చేస్తున్న ఘనత బిజెపి ఎంపిలకే దక్కుతుందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్

**పటాన్‌చెరు, జూలై 25,ప్రభాతవార్త:** మోసపూరిత హామీలతో అధికారంతోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామిలన్నిటిని నేరవెర్చే వరకు ప్రతి కార్యకర్త ఉద్యమకారుడిలా పోరాడాలని జిన్నారం మండల బిజెపి నాయకులు అన్నారు. గురువారం జిన్నారం మండలం బిజెపి పార్టీ అధ్యక్షులు జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి నరేందర్‌రెడ్డి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోసపూరిత హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామిలన్నింటిని నేరవేర్చేంతవరకు ప్రతి కార్యకర్త ఒక ఉద్యమకారుడిలా పోరాడాలని పిలుపునిచ్చారు. అలాగే రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రతి బిజెపి కార్యకర్త వార్డు మెంబర్స్ స్థాయి నుండి మొదలు పెడితే జడ్పీటీసీ వరకు పోటీ చేసి విజయం సాధించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వంగేటి ప్రతాపరెడ్డి, దోమదుగు రమేష్, పి సుధాకర్, వై వెంకటేష్, కృష్ణ, అశోక్, మహేష్, లక్ష్మన్, శ్రీనివాస్, వెంకటేష్, మహేష్, వీరేష్, అశోక్, భార్గవ్, ప్రదీప్, రాజు ఇంకా కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిజెపి నాయకులు


ధ్వజస్థంభ ప్రతిష్టాపనలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు

## భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్టాపన

**నర్సాపూర్ జూలై 25, ప్రభాతవార్త :** ఆషాఢ మాసాన్ని పురస్కరంచుకుని నర్సాపూర్‌లోని అంబేద్కర్ కాలనీలో వెలిసిన శ్రీపోచమ్మ తల్లి ఆలయంలో నూతనంగా ఏర్పాటుచేసిన ధ్వజస్థంభాన్ని భక్తిశ్రద్ధలతో గురువారం ప్రతి ష్టించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ నెల 29న బోనాల ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి సమర్పించడం జరుగు తుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలను స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పంబళ్ళ బిక్షపతి, సర్వేశ్, నీరుడి చంద్రయ్య, బబ్బూరి కృష్ణ, జలందర్, శ్రీనివాస్, మహేశ్, శివరాములు, బుడ్డన్న రాములు, మల్లేషం ,కుమార్, గుమ్మడి పోచయ్య, నరేశ్, బాలరాజ్, నరేశ్ కాలనీ వాసులు తదితరులుపాల్గొన్నారు.

## చౌటకూరులో ఘనంగా బోనాల సందడి


చౌటకూరులో బోనాలను ఊరేగిస్తున్న మహిళలు

**చౌటకూరు, జూలై 25, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో గురువారం ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని గ్రామ దేవతలకు (పోచమ్మ, దుర్గమ్మ, భూలక్ష్మమ్మ) బోనాల పండగను నిర్వహించారు. గ్రామంలోని మహిళలు ఇళ్ల గ్రామ కూడలి వద్దకు చేరుకుని సామూహికంగా పురవీధుల గుండా డప్పు చప్పుళ్లతో అమ్మవార్ల ఆలయాలకు చేరుకుని బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.కాగా గ్రామం నుంచి అత్తారింటికి వెళ్లిన ఆడపడుచులు పుట్టింటికి పిల్లాపాపలతో చేరుకోవడంతో గ్రామం సందడిగా మారింది. బోనాలు నిర్వహించడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది.

**జోగిపేటలో...**


జోగిపేటలో బోనాలను ఊరేగిస్తున్న మహిళలు

**జోగిపేట, జూలై 25, ప్రభాతవార్త:** ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని 12వ వార్డులో కౌన్సిలర్ కొరబోయిన నాగరాజు(నాని) ఆధ్వర్యంలో గురువారం బోనాల పండగను నేత్ర పర్వంగా భక్తులు ఘనంగా జరుపుకున్నారు.వార్డుతోపాటు పట్టణంలోని ఇండ్ల నుంచి బోనాలతో వార్డు కూడలికి చేరుకుని సామూహికంగా బోనాలను పోతురాజుల విన్యాసాలు, డప్పుచప్పుళ్ల మధ్య పురవీధులగుండా బోనాలను పట్టణంలోని క్లాక్ టవర్, గౌని మీదుగా ఊరేగిస్తూ పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో వులువల సత్తయ్య, వులువల రమేష్, నర్ర భీమ్ రాజ్, వులువల శివకుమార్, బందిగి శ్రీనివాస్, నర్ర సురేష్, అల్లె రాకేష్, రవీందర్,ఉలువల పరశురాం, మహేందర్ పాల్గొన్నారు.

## నీటి ప్రమాద నివారణకు ప్రతిపాదనలు పంపండి

**-మెదక్ ఆర్‌డిఓ రమాదేవి**


ఏడుపాయల నీటి ప్రమాదాలపై మాట్లాడుతున్న ఆర్‌డిఓ రమాదేవి

**పాపన్నపేట, జూలై 25, ప్రభాతవార్త:** ఏడుపాయల వనదుర్గా భవాని ఆలయ పరిసరాల్లో తరచూ నీటిప్రమాదాలు జరుగుతూ నిండూ ప్రాణాలు గాల్లో కలసిపోతున్నాయని, ప్రమాద నివారణకు ప్రతిపాదనలు పంపాలని మెదక్ ఆర్‌డిఓ రమాదేవి సూచించారు. గురువారం ఏడుపాయల ఆలయ ఆవరణలోని మంజీరానది తీరంలో ప్రమాదాలు జరిగే స్థలాలను తహసీల్దార్ లక్ష్మణ్‌బాబుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఓ రమాదేవి మాట్లాడుతూ తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్న స్థలంలో రక్షణ చర్యలు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నీటి పారుదల శాఖ అధికారులకు ఆదేశించారు. భారీ వర్షాలు కురుస్తున్నందున ఘనపూర్ ప్రాజెక్టు వద్ద వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందని, అందుకు భద్రత చేపట్టాలని, ప్రాజెక్టు పైకి ఎవరు రాకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## అధ్వానం కిషన్‌నాయక్ తండా మెటల్‌రోడ్డు

**సిర్గాపూర్, జూలై 25, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కిషన్ నాయక్ తండాకు వెళ్లే మెటల్‌రోడ్డు బురదలో కూరుకుపోయింది. చిన్న పాటి చినుకులు పడితే ఈ రోడ్డు బురదమయంగా మరడంతో కాలినడకకు సైతం అవకాశం లేకుండాపోతోందని తండావాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలినడకకే అవకాశం లేని ఆ రోడ్డు గుండా వాహనాలు ప్రయాణించలేవని చెప్పడం అతిశయోక్తి కాదు. పిడబ్లుడి రోడ్డు నుంచి కిషన్ నాయక్ తండా మీదుగా పొట్పల్లి వరకు వెళ్లేందుకు మెటల్ రోడ్డు వేసి గమ్మున కూర్చున్న అధికారలు మెటల్‌రోడ్డును బిటి రోడ్డుగా మార్చేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపకపోవడం, పాలకులు రోడ్డు నిర్మాణానికి శ్రద్ధ చూపక పోవడంతో తండావాసులు పడుతున్నపాట్లు చెప్పనలవిగా ఉన్నాయి. ఇప్పటికై సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకుని బిటి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని తండావాసులు వినతి చేస్తున్నారు.


కిషన్ నాయక్ తండాలో బురదమయంగా మారిన రోడ్డు దుస్థితి

# స్థానిక ఎన్నికల్లో బిజెపి సత్తాచాటాలి

### బిజెపి ఒబిసి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్

**నర్సాపూర్, జూలై 25, ప్రభాతవార్త :** బిజెపిని బలోపేతం చేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చూపాలని ఆ పార్టీ ఒబిసి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాపగారి రమేశ్‌గౌడ్ అన్నారు. గురువారం నర్సాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో విస్తృతస్థాయి సమావేశాన్ని పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పాపగారి రమేశ్‌గౌడ్ మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి అందరూ కలిసి పనిచేయాలన్నారు. రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో బిజెపి సత్తాచాటి అన్నింటా విజయం సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి అసెంబ్లీ కన్వీనర్ రమణారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గోడ రాజేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు బుచ్చేష్‌యాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి సంగసాని సురేశ్, నాయకులు ఎర్రగొల్ల


మాట్లాడుతున్న రమేశ్‌గౌడ్

రమేశ్‌యాదవ్, ఎరుకలి యాదగిరి, మండల అధ్యక్షుడు నీలి నాగేశ్, పట్టణ ప్రధాన కార్యదర్శి బోర్‌వెల్ రామ్‌రెడ్డి, బిజెవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి హన్మంతు భరత్‌రామ్, బలరాజ్, శక్తి కేంద్రం ఇన్‌చార్జులు, బూత్ అధ్యక్షులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి

**-టిఎస్‌ఎస్‌సిడిసి మాజీ చైర్మన్ నరోత్తం**

**జహీరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చేయి చూపించిందని టిఎస్ స్‌సి ఐడిసి మాజీ చైర్మన్ నరోత్తం విమర్శించారు. గురువారం నరోత్తం మాట్లాడుతూ తెలంగాణను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి ఉందని, కాని బడ్జెట్‌లో నిధులు కేటాయించక సవతితల్లి ప్రేమ చూపిందని విచారం వ్యక్తం చేశారు. తెలంగాణ నుంచి 8 మంది ఎంపిలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ప్రాతినధ్యం వహిస్తున్నా రాష్ట్రానికి నిధులు మంజూరు చేయించుకోవడంలో పూర్తిగా విఫలం అయ్యాయరి ఆందోళన వ్యక్తం చేశారు. సమాజం బాగుండాలంటే విద్య ముఖ్యమని గతంలో కమిటీలన్నీ జీడిపిలో 6 శాతంపై కేటాయించాలని సిఫార్సు చేశారని అయినా బడ్జెట్‌లో 3 శాతం మాత్రమే కేటాయించడం ఎంత వరకు సమంజసమని నరోత్తం ప్రశ్నించారు. విద్యకు సరైన రీతిలో సదుపాయలు లేకుంటే ఎందరో విద్యావంతులు ఉన్నత చదువుల కొరకు ఇతర దేశాలకు పోవాల్సి వస్తోందని, ఫలితంగా ఒక్కో విద్యార్థి విదేశీ యూనివర్సిటీలకు రమారమిగా 50లక్షల రూపాయల వరకు చెల్లించాల్సి వస్తుందని గుర్తు చేశారు. ప్రపంచంలో అత్యధికంగా చదువుకునే వారు భారత దేశంలో ఉన్నారని, అయినా సదుపాయాల కల్పనలో యుఎస్‌ఎ మొదటి స్థానంలో, యుకే 2వ స్థానంలో ఉండగా భారత దేశం 32వ స్థానంలో ఉండిపోయిందని విస్మయం వ్యక్తం చేశారు. విద్యారంగంపై కేంద్రప్రభుత్వం దృష్టి సారించాలని నరోత్తం సూచించారు.

## నాగల్‌గిద్ద ఎంపిఓగా మహేశ్వర్‌రావు

**నాగల్‌గిద్ద, జూలై 25, ప్రభాతవార్త:** మండల పంచాయతీ అధికారిగా (ఎంపిఓ)గా కే మహేశ్వర్‌రావు గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. జహీరాబాద్‌లో విధులు నిర్వహించిన మహేశ్వర్‌రావును అధికారులు నాగల్‌గిద్ద మండలానికి బదిలీ చేయడంతో గురువారం నాగల్‌గిద్ద మంల పరిషత్‌కు చేరుకుని బాధ్యతలు స్వీకరించారు.

## హెచ్‌ఎంను సన్మానించిన నాయకులు


బదిలీపై వెళుతున్న హెచ్‌ఎంను సన్మానిస్తున్న నాయకులు

**నాగల్‌గిద్ద, జూలై 25, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గొందిగామ ప్రాథమిక పాఠశాలలో 14 సంవత్సరాలుగా ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించి బదిలీపై వెళుతున్న బస్వరాజ్‌ను, ఉపాధ్యాయులు శివరాజులను కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను ఘనంగా శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికారు.

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**మున్సిపల్ చైర్‌పర్సన్ రజితవెంకన్న**

**హుస్నాబాద్, జూలై 25,ప్రభాతవార్త :** సీజనల్ వ్యాదులు ప్రభలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న అన్నారు.గురువారం పట్టణంలోని 20వ వార్డులో వార్డు కౌన్సిలర్ వాల సుప్రజనవీన్‌రావు ఆధ్వర్యంలో పరిశుభ్రత పాటించండి రోగాలను తరలిమికొట్టండి అనే కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న చెత్త విభజన, తడి చెత్త,పొడి చెత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వార్డులో ఇంటింటికి తిరుగుతూ వాటర్ ట్యాంకులతో పాటు ఇండ్ల బయట ఉన్న పాడుబడ్డ వస్తూలలో ఎక్కువ రోజులుగా నిల్వ ఉన్న నీటిని తొలగించారు. వార్డులో నీరు నిల్వ ఉండే ప్రాంతాలలో స్ప్రే చేయడంతో పాటు బ్లీచింగ్ ఫౌడర్ చల్లించారు.ప్రజలు ఇండ్లలో నీరు ఎక్కువ నిల్వ ఉండకుండా చూసుకోవాలని, నీరునిల్వ ఉంటే జరిగే జరిగే అనర్థాలను వివరించారు.అంతే కాకుండా ప్రతీ ఒక్కరు కనీసం ఒక్క మొక్కను నాటాలన్నారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ సాయిప్రణీత్,శానిటరీ ఇన్స్‌స్పెక్టర్ బాల ఎల్లం,వన మహోత్సవ ఇన్స్ పెక్టర్ జాలిగం శంకర్,ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ రవికుమార్ పాల్గొన్నారు.


మురుగు కాలువలో స్ప్రే చేయిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్


కర పత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

## మహిళల హక్కుల, చట్టాలపై అవగాహన

**దుబ్బాక, జూలై 25, ప్రభాతవార్త:** మహిళలు సమాజంలో సభ్యులని, హక్కులు, చట్టాల గురించి అందుబాటులో ఉన్న సహాయక సేవల గురించి అవగాహన కలిగి ఉండాలని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి తెలిపారు.గురువారం దుబ్బాక పట్టణంలో ఐసిడిఎస్ కార్యాలయంలో మహిళ అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, మిషన్ శక్తి జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా సంక్షేమ అధికారిని శారద నేతృత్వంలో దుబ్బాక సిడిపిఓ చంద్రకళ సమక్షంలో 100 రోజుల స్పెషల్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిథులుగా దుబ్బాక సిఐ శ్రీనివాస్, కమిషనర్ రమేష్ కుమార్‌లు హజరై మాట్లాడారు. మహిళలకు గల చట్టాలు, హక్కులను వివరించారు. అలాగే మహిళ, పిల్లలకు అందుబాటులో ఉన్న మహిళ హెల్ప్‌లైన్ 1098 సేవల గురించి, బాల్య వివాహాల వల్ల జరిగే నష్టల గురించి తెలిపారు. మహిళా హక్కులతో పాటుగా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సమాజంలో పురుషులతోపాటు స్త్రీలకు సమాన హోద ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోషణ అభియాన్ కో ఆర్డినేటర్, జిల్లా మహిళ సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్, జెండర్ స్పెషలిస్ట్‌లు, మెప్మా ఆర్పిలు, పాల్గొన్నారు.

## ఘనంగా గంగమ్మ తల్లి జాతర ఉత్సవాలు


సింగూరు ప్రాజెక్టు వద్ద గంగమ్మ తల్లికి జాతర నిర్వహిస్తున్న ముదిరాజ్‌లు

**పుల్కల్, జూలై 25, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సింగూరు ప్రాజెక్టు వద్ద ముదిరాజ్ సంఘం ప్రజలు గురువారం గంగమ్మతల్లికి జాతర ఉత్సవాలు నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురువాలని వేడుకుంటూ అమ్మవారిని వేడుకున్నారు. రైతులు పాడిపంటలు బాగా పండాలని, మత్స్యకారులకు జీవనోపాధి కల్గాలని సింగూరు ముదిరాజ్‌లు మత్స్యకారులు గంగమ్మ తలిని వేడుకున్నారు. గ్రామశివారులోని మంజీరా ప్రాజెక్టు వద్ద కొన్ని సంవత్సరాలుగా గంగమ్మ దేవతకు జాతరనిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని మత్స్యకారులు పేర్కొన్నారు. మత్స్యకారులకు ప్రభుత్వం అండగా ఉండాలని, చెరువులలో లక్షలాదిగా చేపపిల్లలను వదలాలని వినతి చేశారు. మత్స్యకారులకు హెల్త్ ఇన్సురెన్స్ కల్పించాలని ప్రభుత్వానికి వారు వినతి చేశారు.

## ఆర్టీసీ కార్గో సేవలను ప్రజలు సద్వినియోగం

**కరీంనగర్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామారావు**

**హుస్నాబాద్ టౌన్, జూలై 25, ప్రభాతవార్త :** ఆర్టీసీ కార్గో సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజరు వి రామారావు అన్నారు. లాజిస్టిక్ మేనేజర్‌గా నూతనంగా బాధ్యతలు తీస్వకరించిన ఆయన గురువారం హుస్నాబాద్ బస్టాండులోని ఆర్టీసి కార్గో కార్యాలయాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 19 రాఖీ పౌర్ణమి సందర్భంగా మహిళలు అన్నదమ్ములకు ప్రత్యేకంగా రాఖీ కట్టడానికి వెల్లలేని ఆడపడచులు ఆర్టీసీ పార్సల్ సర్వీస్ ద్వార తక్కువ ధరల్లో రాఖీలను ఇతర రాష్ట్రాలకు పంపిచవచ్చన్నారు. పూర్తి వివరాలకోసం లాజిస్టిక్ సేల్స్ టీమ్ లీడర్ రాజు, 9154298581, సేల్స్ టీమ్ సభ్యుడు సురేష్ 9154298673 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.


మాట్లాడుతున్న రామారావు

## రాష్ట్ర బడ్జెట్‌లో బిసి సంక్షేమానికి ప్రాధాన్యత కరువు

**-ఫోరం ఫర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర**

**సంగారెడ్డి టౌన్, జూలై 25, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం గురువారం శాసనసభలో ఆర్థిక మంత్రి శ్రీధర్‌బాబు ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో బిసి సంక్షేమం, పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యత లేకుండా పోయిందని, ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణానికి అరకొర కేటాయింపులే చేశారని ఫోరం ఫర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర విమర్శించారు. గురువారం ఆయన మాట్లాడుతూ జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బిసిలకు ప్రాధాన్యత లేకుండా చేశారన్నారు. పట్టణాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. రీజినల్ రింగ్ రోడ్డుకు సైతం అరకొర కేటాయింపులే చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మెట్రో విస్తరణ మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు విస్తరణకు ప్రకటన మాత్రమే చేశారని, బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని దుయ్యబట్టారు. మెట్రో రైలు మార్గాన్ని సంగారెడ్డి వరకు విస్తరించాలని, లేదా ఎంఎంటిఎస్ రైలు మార్గాన్ని సంగారెడ్డి వరక వేయాలని శ్రీధర మహేంద్ర డిమాండ్ చేశారు.

## 14వ రోజు కొనసాగిన రైతుల రిలే దీక్షలు

**నర్సాపూర్, జూలై 25, ప్రభాతవార్త:** కొండపోచమ్మ కాలువ మాకొద్దంటు కొన్ని రోజులుగా భూనిర్వాసితులు చేస్తున్న రిలే నిరహార దీక్షలు గురువారం 14వ రోజుకు చేరింది. ఈ దీక్షలకు లోక్‌సత్తా నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి మిర్యాల చంద్రశేఖర్‌గుప్త మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూనిర్వాసిత రైతుల న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. చెన్నాపూర్, బ్రాహ్మణపల్లి, చిన్నచింతకుంట గ్రామాలకు చెందిన రైతులు ఈ దీక్షలో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు నర్సింహారెడ్డి, రమేశ్‌గౌడ్, నార్ల అంజాగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, రామకిషన్, రాజమౌళి, పోచయ్య, కిషన్‌నాయక్, సత్తాగౌడ్, శ్రీశైలంయాదవ్, పెంటయ్య రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నర్సాపూర్‌లో అధికారుల బదలీలు

**నర్సాపూర్, జూలై 25, ప్రభాతవార్త :** రాష్ట్ర స్థాయిలో ఆయా శాఖలలో జరుగుతున్న బదిలీ ప్రక్రియలో భాగంగా నర్సాపూర్‌లోనూ పలు శాఖల అధికారులు బదిలీలు అయ్యారు. నర్సాపూర్ అటవీశాఖ రేంజ్ అధికారి అంబర్‌సింగ్ హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి బదిలీ కాగా ఆయన స్థానంలో ఖమ్మం నుంచి అరవింద్ రానున్నారు. అదేవిధంగా సబ్ రిజిస్ట్రార్ నీలోఫర్ మేడ్చెల్ జిల్లాకు బదిలీ కాగా ఆమె స్థానంలో ఇంకా ఎవరూ రాలేదు. గిరిజన గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ బిక్షమయ్య వరంగల్ జిల్లాకు బదిలీ కాగా ఆయన స్థానంలో కొడంగల్ నుంచి బలరామ్ వచ్చారు. అలాగే నర్సాపూర్ మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు 12 మంది బదిలీ అయ్యారు. ఇందులో 6 మంది కార్యదర్శులు కౌడిపల్లి మండలానికి బదిలీ కాగా మిగతా 6 మంది ఇతర గ్రామాలకు బదిలీ అయ్యారు.

## వర్షాలు కురుస్తున్నాయి..జాగ్రత్తలు పాటించండి

**పుల్కల్, జూలై 25, ప్రభాతవార:** ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ సూచించారు. రైతులు పనుల నిమిత్తం పొలాలకు వెళ్లేటప్పుడు విద్యుత్ స్థంభాలు, వైర్లకు దూరంగా ఉండాలన్నారు. రోడ్డుపై వాహనంపై వెళుతున్న క్రమంలో ఓవర్‌టేక్ చేసే సందర్భంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాతబడిన ఇండ్లలో నివాసం ఉండకుండా తాత్కాలికంగా మరో ఇంట్లో నివాసం ఉండేలా చూడాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలు తగు జాగ్రత్తతో ఉండాలని పేర్కొన్నారు.

## పేద కుటుంబానికి నిత్యావసర వస్తువులు అందచేత

**సిర్గాపూర్, జూలై 25, ప్రభాతవార్త:** పూటగడవని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్న పేద కుటుంబానికి చెందిన మండలంలోని నల్లవాగుకు చెందిన మైబుబ్-బిబమ్మ కుటుంబానికి గుబ్బపు మచ్చేందర ఆపన్న హస్తం అందచేశారు. గురువారం మచ్చేందర్ కుటుంబానికి నెలకు సరిపడ నిత్యావసర సరుకులు అందచేశారు. మైబుబ్-బిజమ్మలకు సొంత ఇల్లు లేక ఓవైపు పనులు చేసుకునేందుకు ఒంట్లో శక్తిలేక పూటగడుపుకునేందుకు వారు పడుతున్న పాట్లు చెప్పనలవిగా ఉన్నాయి. విషయం తెలుసుకున్న మచ్చేందర తన వంతు నెలకు సరిపడ సరుకులు అందించి అందరిచే శభాష్ అనిపించుకున్నారు.

## రుణ మాఫీ అందిస్తున్న అధికారులు


రైతుకు రుణ మాఫీ అందిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

**కొండపాక, జూలై 25, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌ను గురువారం జిల్లా వ్యవసాయ అధికారి మహేష్, లీడ్‌బ్యాంక్ జిల్లా మేనేజర్ హరిబాబుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా 2024 రుణ మాఫీ ప్రక్రియాను పరిశీలించారు. అనంతరం రైతు చింతల సుధాకర్ మాఫీ రుణం రూ॥ 68 వేలు అందించారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ రవి శంకర్, ఎఒ ప్రియదర్శిని, ఎఈఓ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## రైతు బీమాకు దరఖాస్తులు చేసుకోవాలి : ఎడిఎ

**కొండపాక, జూలై 25, ప్రభాతవార్త :** రైతు బీమాకు అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఎడిఎ బాబునాయక్ అన్నారు. గురువారం కుకునూరుపల్లిలో రైతు బీమా దరఖాస్తులను ఎఈఓ రజిత స్వీకరిస్తుండగా ఆ ప్ర క్రియను అయన పరిశీలించారు. జూలై 30 వరకు రైతు బీమాలో సవరణల కోసం, అగస్టు 5వ తేది వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూన్ 28 వరకు కొత్తగా పట్టాదార్ పాస్ బుక్‌లు వచ్చిన రైతులు, గతంలో బీమా కోసం దరఖాస్తు చేసుకున్న వారు బీమాలో సవరణల కోసం అధార్‌లో మార్పులు, నామిని చనిపోతే దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు పారంతో పాటు రైతు పట్టాదారు పాస్ బుక్, తహసీల్దార్ సంతకం చేసిన డిజిటల్ సైన్ పేపర్, రైతు అధార్ కార్డు, నామిని అధార్ కార్డు జిరాక్స్‌లు అయా గ్రామాల్లోని ఎఈఓలకు ఇవ్వలని సూచించారు.

## ప్రధాన రోడ్డుకి ఇరువైపుల ప్రమాదపు గుంతలు

**రాత్రి వేళలో కానరాని గుంతలు.. వాహనాదారులు అదుపు తప్పితె అంతే సంగతి**

**దుబ్బాక(అక్బర్‌పేటభూంపల్లి), జూలై 25, ప్రభాతవార్త :** రోడ్ల విస్తరణలో భాగంగా రెండు నెలల క్రితం అక్బర్‌పేట భూంపల్లి మండల కేంద్రం లో ప్రధాన కూడలి వద్ద డ్రైనేజీ నిర్మాణం కోసం గుంతలు తీయడం జరిగింది. డ్రైనేజ్ నిర్మాణం కోసం తీసినగుంతలు నేడు ప్రయాణికులకు యామపాశాలుగా మారాయి. ప్రయాణికులు రోడ్డు దాటా లంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. ప్రధాన కూడలి నుండి భూంపల్లి గ్రామానికి వెళ్లె దారిలో రెడ్డుకు ఇరు వైపుల అలాగే ఇటుగా రామలింగేశ్వర స్వామి ఆలయానికి, కామారెడ్డి వెళ్లె దారిలో గుంతలు ఉన్నాయి. రాత్రి వేళలో గుంతలు కానరాక అనేక మంది గుంతలో పడ్డారు. కాని ఇప్పటి వరకు ఏలాంటి ప్రాణహాని మాత్రం జరగలేదు. రోడ్డుకు ఇరువైపుల గుంతలు ఉండడంతో ప్రయానికులు చాల ఇబ్బందులకు గురవుతున్నారు. వాహనం అదుపు తపిందా సంగతి అంతే గుంతలో పడాల్సిందే. గుంతలను, రోడ్డు పనులను చూసి ప్రయానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇక వైపు రోడ్డుకు ఇరువైపుల డ్రైనేజ్ గుంతలు, మరోవైపు రోడ్డుపై గుంతలతో ప్రయాణికులు అష్ట కష్టకష్టాలు పడుతున్నారు. అక్బర్‌పేటభూంపల్లికి రావాలి అంటేనే ప్రయానికులు అబ్బో అంటున్నారు. రోడ్డు మరమత్తు పనులపై ప్రయానికులు అసహనం వ్యక్త చేస్తున్నారు. ఇప్పటికై సంబదిత అధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేసి ప్రయానికులకు సౌకర్యవంతమైన రహదారులు, డ్రైనేజిని నిర్మించి అందుబాటులో ఉంచాలని ప్రయానికులు కోరుతున్నారు.


రామలింగేశ్వర ఆలయానికి వెళ్లె దారిలో ప్రమాదపు గుంత

# నాలుగు మండలాల నిరుద్యోగులకు న్యాయం జరిగేనా...!?

### బిజెపి ఎస్సీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల శంకర్‌బాబు

**హుస్నాబాద్, జూలై 25, ప్రభాతవార్త** సింగరేణి కాలరీస్ కంపనీ లిమిటెడ్ నోటిఫికేషన్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని నాలుగు మండలాల నిరుద్యోగులకు బిఆర్‌ఎస్,కాంగ్రెస్ ప్రభుత్వాల వల్ల తీవ్ర అన్యాయం జరుగుతుందని బిజెపి ఎస్సి మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల శంకర్‌బాబు మండాపడ్డారు.గురువారం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమవేశంలో మాట్లాడుతూ గత బిఆర్‌ఎస్ పాలనలో అప్పటి మంత్రి హరీష్‌రావు,ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్‌ల అనాలోచిత నిర్ణయాలతో జిల్లాల పునర్విభజన చేసి ఉమ్మడి కరీంనగర్‌లోని హుస్నాబాద్,కోహెడ,అక్కన్నపేట,బెజ్జంకి మండలాలను సిద్దిపేట జిల్లాలో కలపడంతో సింగరేణి కాలరీస్ లిమిటెడ్ కంపనీ విడుదల చేసిన 327 పోస్టులకు ఈ నాలుగు మండలాల నిరుద్యోగులు తమ స్థానికతను కోల్పోయారన్నారు.స్థానిక జిల్లా నిరుద్యోగులకు 95శాతం ఉద్యోగాలు కల్పిస్తుండగా నాలుగు మండలాల నిరుద్యోగులకు జరిగే అన్యాయంపై


మాట్లాడుతున్న బత్తుల శంకర్‌బాబు

ప్రస్తుత హుస్నాబాద్ శాసనసభ్యులు,రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళగా ఈవిషయాన్ని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి దృష్టికి మంత్రి తీసుకెళ్లినా ఈ విషయాన్ని పెడచెవిన పెట్టి ఈ ప్రాంత నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.ఇప్పటికైనా నిరుద్యోగ నియోజకవర్గ సమస్యల పట్ల మంత్రి స్పందించి ఈ విషయంపై చొరవ తీసుకుని నిరుద్యోగులకు న్యాయం జరిగే విదంగా కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గాదాసు రాంప్రసాద్,పోలోజు రాజేందర్,ఆశాడపు శ్రీనివాస్ పాల్గొన్నారు.